నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 28 జనవరి 2025 | KARIMNAGAR

మేయర్‌పై అవిశ్వాసం

- కలెక్టర్‌కు నోటీసులు అందించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- వ్యతిరేకతను తెలిపేందుకే అవిశ్వాసం: బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- మేయర్ పదవికి రాజీనామా చేయకుండానే బీజేపీలో ఎలా చేర్చుకున్నారు : రవీందర్‌సింగ్

మేయర్‌పై కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందిస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 27: కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావుపై సోమవారం బీఆర్ఎస్ కార్పొరేటర్లు కలెక్టర్ పమేలా సత్పతికి అవిశ్వాస నోటీసులు అందించారు. ఇటీవల మేయర్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరడంతో ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ అవిశ్వాస నోటీసులు అందించింది. ఆ నోటీసులపై బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీ హరిశంకర్‌తో కలిసి 26 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పాటు ఆరుగురు కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు సైతం సంతకాలు చేశారు. ఈ నోటీసులను డిప్యూటీ మేయర్‌తో కలిసి కార్పొరేటర్లు కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు రాజేందర్ రావు, మహేశ్, మాధవి, స్వరూపారాణి మాట్లాడుతూ పార్టీ మారిన మేయర్‌పై ఎంత వ్యతిరేకత ఉందో ప్రజలకు తెలిపేందుకే ఈ అవిశ్వాస నోటీసులు అచ్చినట్లు తెలిపారు. మంగళవారంతో పాలకవర్గ పదవీ కాలం ముగుస్తుందన్న విషయం తెలుసని, మేయర్ తీరుపై కార్పొరేటర్లు ఎంత వ్యతిరేకంగా ఉన్నారని చెప్పేందుకే ఈ చర్య తీసుకున్నామని చెప్పారు. తమకు ఇష్టం లేకపోయినా స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట మేరకు పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుందని, అందుకే మేయర్‌గా సునీల్‌రావును బలపర్చామన్నారు. అవినీతిపరుడైన సునీల్‌రావు స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం సరికాదని హితవుపలికారు. నమ్మిన వారిని మోసం చేసే వ్యక్తి సునీల్ అని దుయ్యబట్టారు. మచ్చలేని గంగులపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఊసరవెల్లిలా పార్టీలు మార్చే వ్యక్తిని బీజేపీ నాయకులు తమ పార్టీలోకి ఎలా తీసుకున్నారో వారికే తెలియాలన్నారు.

రాజీనామా చేయకుండా ఎలా చేర్చుకున్నారో సంజయ్ చెప్పాలి

తమ పార్టీలో చేరాలంటే పదవులకు రాజీనామా చేయాలని కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అనేక మార్లు చెప్పారని, మరి ఇప్పుడు సునీల్‌రావును మేయర్ పదవికి రాజీనామా చేయకుండా ఎలా చేర్చుకున్నారో సమాధానం చెప్పాలని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ప్రశ్నించారు. వారు పెట్టుకున్న నిబంధనలను వారే ఉల్లంఘించారని గుర్తుచేశారు. గతంలో ఈటల రాజేందర్ బీజేపీలో చేరితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని, మరి ఇక్కడ ఎందుకు రాజీనామా చేయించలేదో తెలపాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీలో నాయకుడికో న్యాయం అన్నట్లుగా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందని తాను ఫిర్యాదు చేయడంతోపాటు బండి సంజయ్ కూడా గతంలో ఫిర్యాదు చేశారని, మరి ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, 26 మంది కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచే పోలీస్ గేమ్స్

- కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి పోటీలు
- 20 పోలీస్ జోన్స్ నుంచి 2500 మంది క్రీడాకారులు హాజరు
- 12 క్రీడా వేదికలపై 29 క్రీడాంశాల్లో పోటీలు
- ప్రారంభించనున్న ఇంటిలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి

కరీంనగర్ రాంనగర్, జనవరి 27 : మూడో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీలు ఈ నెల 28 నుంచి నాలుగు రోజులపాటు కరీంనగర్ క్రీడా కేంద్రంగా జరుగనున్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీ ల్లో రాష్ట్రంలోని 20 పోలీస్ జోన్స్ నుంచి 2500 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని 12 క్రీడావేదికలపై 29 క్రీ డాంశాలలో ఈ పోటీలను ఘనంగా నిర్వహించేందు కు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. మంగళవా రం సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లోని పరేడ్ క్రీడా మైదానంలో పోటీలను ఇంటిలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. నగరంలోని సీటీసీ, హెడ్ క్వార్టర్స్, అంబేద్కర్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్, సీపీటీసీ, కరీంనగర్ క్లబ్, జీ ఎస్ అకాడమీ, అలుగునూర్‌రోడ్, తదితర ప్రాం తాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. క్రీడాకారులకు ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటి క్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, వాటర్ స్పో ర్ట్స్, షటిల్ బ్యాడ్మింటన్, జూడో, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, హాకీ, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, యోగా, తదితర 29 క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న ఉదయం 8 గంటల కు పోటీల ముగింపు సమావేశం నిర్వహించనున్నా రు. దీనికి ముఖ్యఅతిథిగా డీజీపీ డాక్టర్ జితేందర్ హాజరవుతారని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు.

అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీలు

- సొంత భవనాల మంజూరెప్పుడో?
- సగానికి పైగా కేంద్రాలది ఇదే పరిస్థితి
- ఇబ్బందుల్లో నిర్వాహకులు, చిన్నారులు, లబ్ధిదారులు

అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 27 : అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. అద్దె గదుల్లో కొనసాగుతున్న సెంటర్లలో ఇరుకు గదులు, పొగ, ఘాటు వాసనతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు, రాష్ట్ర వ్యాప్తంగా శాశ్వత భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించామంటూ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బాధ్యతలు తీసుకున్న సందర్భంగా చేసిన ప్రకటన ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. సొంత భవనాల నిర్మాణ ప్రకటన కాగితాలకే పరిమితం కాగా.. ఓవైపు బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార వంటలు, మరోవైపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యాబోధన ఒకే గదిలో కొనసాగుతున్నది. దీంతో ఇటు లబ్ధిదారులు, అటు బాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రంగా ఒకటో, రెండు చోట్ల మాత్రమే సొంత భవనాల నిర్మాణాలు ప్రారంభించినా అవి పునాదులను వీడడం లేదనే ఆరోపణలున్నాయి. ఇచ్చిన హామీని అటకెక్కించి ఉన్న వాటికే మెరుగులు దిద్దడం ఏమేరకు సముచితమో స్పష్టం చేయాలనే డిమాండ్ నిర్వాహకుల నుంచి వస్తోంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న చోట శాశ్వత ప్రాతిపదికన కొత్త భవనాలు నిర్మించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవసరమైన ప్రతిపాదనలు రూపొందించారు. అయితే, గతేడాది ప్రభుత్వం మారడంతో వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. తమ హయాంలో తిరిగి కొత్తగా నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పలు సభల్లో ప్రకటించారు. అద్దె భవనాలున్న చోట సొంత గదులు నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లాలో కొన్నిచోట్ల నూతన భవనాల నిర్మాణానికి భూమి పూజలు కూడా చేశారు. అయితే, నిధుల లేమితో పునాదుల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో నాలుగు అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉండగా, వీటి పరిధిలో 777 కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో 291 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, మరో 231 సెంటర్లు ఉచిత అద్దె ప్రాతిపదికన ప్రాథమిక పాఠశాలలు, గ్రామపంచాయతీలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. మిగతా 255 కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. వీటికి కూడా ఏడాదికో, ఆర్నెళ్లకో అన్నట్లు అద్దె చెల్లిస్తుండగా, నిర్వాహకులపై ఇళ్ల యజమానులు మండిపడడం సర్వసాధారణంగా మారింది. ఈ పరిస్థితుల్లో సెంటర్లను పదే పదే మార్చుతుండడం షరా మామూలైంది. ఇది నిర్వాహకులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బందికరంగా మారింది. ఆరేళ్లలోపు చిన్నారులకు వ్యాక్సినేషన్ చేయడం, లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడంలో నిర్వాహకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు

జగిత్యాల రూరల్, జనవరి 27 : జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులను ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 29న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బీ సత్తమ్మ సోమవారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. కేఎల్ గ్రూప్ హైదరాబాద్ సంస్థలో ప్యాకింగ్, స్టోయింగ్, స్టోరింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ ఖాళీల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటి కోసం కనీసం పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత అయి ఉండి, ఇంగ్లిష్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని నెలకు వేతనం రూ.16 వేల నుంచి 25వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీలో సమ్మె సైరన్

సీఎండీకి నోటీస్ ఇచ్చిన జేఏసీ

- కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- సంస్థ ద్వారానే ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలి
- 21 డిమాండ్లతో సమ్మె నోటీసు

ఆర్టీసీలో త్వరలో సమ్మె సైరన్ మోగనున్నది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, తదితర 21 అంశాలపై ఆరు సంఘాలతో కూడిన జేఏసీ సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సీఎండీ సజ్జనార్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఫిబ్రవరి 9 వరకు తమ డిమాండ్లపై యాజమాన్యంగానీ, ప్రభుత్వంగానీ స్పందించకుంటే ఆ తర్వాత మొదటి డ్యూటీ నుంచే సమ్మెను ప్రారంభిస్తామని జేఏసీ ఆధ్వర్యంలో ఇచ్చిన సమ్మె నోటీస్‌లో వివిధ సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని బస్సు భవన్ వద్ద సమావేశమైన జేఏసీ నాయకులు

కరీంనగర్, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీలో త్వరలో సమ్మె జరగనున్నది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం సాయంత్రం ఆర్టీసీ సీఎండీ సజ్జనార్‌కు ఆరు సంఘాల ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు సమ్మె నోటీస్ ఇచ్చారు. వచ్చే నెల 9 వరకు అల్టిమేటం ఇచ్చారు. ఆ తర్వాత మొదటి డ్యూటీ నుంచి సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రధానంగా కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో ఈ హామీలను అమలు చేయాలని కోరుతూ మంత్రులను కలిసి విజ్ఞప్తులు ఇచ్చారు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదని ఉద్యోగ సంఘాల నాయకులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే తాము సమ్మెకు దిగాల్సి వస్తోందని స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలు గడుస్తున్నా దీనిపై ఉలుకూ పలుకు లేకుంటా పోయింది. వెంటనే విలీన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా, 2021 నుంచి రావాల్సిన జీతభత్యాల సవరణ ఇంత వరకు జరగలేదని చెబుతున్నారు. మాస్టర్ స్కేల్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక పక్క డ్రైవర్లు, కండక్టర్లు పని భారంతో గుండె పోట్లకు గురై మరణిస్తుంటే యాజమాన్యం చెకింగ్‌ల పేరుతో జరుగుతున్న వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసే నడపాలి

కొత్త ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో అద్దె వాహనాలను తీసుకొస్తున్నారని, ఈ బస్సుల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు, ఆర్టీసీకి సంబంధం లేదని, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ మొత్తం ప్రైవేట్ వ్యక్తులకే చెందుతోందని, ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీయే తీసుకుని నడపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల ఆ బస్సులు సంస్థకే చెందుతాయనేది కార్మికుల భావన. ఎలక్ట్రిక్ బస్సులపై ప్రైవేట్ గుత్తాధిపత్యం ఉండరాదని, తమకు ఉద్యోగ భద్రత కరువవుతోందని వాపోతున్నారు. సంస్థలో రిటైర్డ్ అయిన తర్వాత ఉన్నవారితోనే పనిచేయిస్తున్నారని, పనిభారం తట్టుకోలేక ఆర్టీసీ కార్మికులు అనారోగ్యంతో రెఫరల్ హాసిటల్స్ చుట్టూ తిరగాల్సి వస్తోందని, దీనికితోడు యాజమాన్యం వేధింపులు రోజురోజుకూ పెరుగుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. కార్మికులతో 14 నుంచి 16 గంటలు డ్యూటీ చేయిస్తూ తమకు భారాన్ని మోపుతున్నారని, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా కార్మికులకు రావాల్సిన ఎన్‌క్యాష్‌మెంట్ ఇంత వరకు చెల్లించ లేదని, కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర అవస్థలు పడుతున్నా యాజమాన్యం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. 2024 నుంచి రిటైర్మెంట్ పొందిన ఉద్యోగులు, కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించ లేదని, గడిచిన ఐదేళ్లుగా కార్మికులు యూనిఫాం కూడా ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇలా అనేక సమస్యలను సమ్మె నోటీసులో ప్రస్తావించిన జేఏసీ నాయకులు ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిష్కరించకుంటే సమ్మెకే..

ఆర్టీసీ యాజమాన్యం ముందు తాము పెట్టిన డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మె అనివార్యం అవుతుంది. సమ్మె చేయాలనేది మా ఉద్దేశం కాదు. మా పట్ల యాజమాన్యం, ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు మారాలి. ఎలాంటి అగ్రిమెంట్లు లేకుండా ఈ బస్సులను ఆర్టీసీ సమకూర్చుకుంటోంది. రూ.1.50 కోట్లు పెట్టి బస్సులు కొంటే కేంద్ర ప్రభుత్వం రూ.35 లక్షలు సబ్సిడీ ఇస్తోంది. ఈ పని ఆర్టీసీ యాజమాన్యమే చేయవచ్చుకదా.. అనేది మా భావన. ప్రైవేట్ యాజమాన్యాలకు వీటిని అప్పగించి ఆర్టీసీ ఆస్తులకు కట్టబెడుతున్నారు. వీటి వల్ల కార్మికుల, భద్రతకు, ఆర్టీసీకి ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రధాన హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఎందుకు మర్చిపోతోంది. ఈ విషయాన్ని అడిగేందుకు మంత్రులు, ముఖ్యమంత్రి వద్దకు వెళ్లితే అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. పీఏలకు వినతి పత్రాలు ఇచ్చి వస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో సమ్మె ఒక్కటే మార్గమని భావిస్తున్నాం.

- మారంరెడ్డి థామస్ రెడ్డి, టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్

ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లు..

- కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఆర్థికపరమైన అంశాలను అమలు చేస్తూ ప్రస్తుత సౌకర్యాలను కొనసాగిస్తూ, ప్రభుత్వంలో తేవాలి.
- 2021 వేతన సవరణ అమలు చేస్తూ, ప్రభుత్వోద్యోగులతో సమానంగా జీతాలు అమలు చేయాలి.
- 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయాలి.
- కొత్త బస్సుల కొనుగోలు ద్వారా ఆర్టీసీని అభివృద్ధి పరిచి, ఆధునీకరించాలి
- సంస్థ అప్పులను ప్రభుత్వమే టేకోవర్ చేసి, రాయితీలకు, సంస్థ అభివృద్ధికి ప్రతియేటా బడ్జెట్లో 3 శాతం కేటాయించాలి
- విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆర్టీసీకి ఇవ్వాలి.
- మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్ బదులు మహిళలకు స్మార్ట్ కార్డు ఇవ్వాలి. రద్దీకను గుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. ఈ స్కీంలో జరుగుతున్న సి, టి కేసుల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.
- బ్రెడ్ విన్నర్, మెడికల్ ఇన్వాలిడేషన్ ఉద్యోగుల కుటుంబాలకు ఇచ్చే ఉద్యోగాలు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. ప్రస్తుతం కన్సాలిడేటెడ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. ప్రభుత్వ జీవో ఎంఎస్ నంబర్ 30 ప్రకారం వయో పరిమితిని 44 సంవత్సరాలకు పెంచాలి. ఈ స్కీంలో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ వంటి పోస్టులను కూడా ఇవ్వాలి
- అన్ని కేటగిరీల్లో ఖాళీలను భర్తీ చేసి అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలి
- ప్రతి కార్మికుడికి 21 రోజుల హాజరుతో ఇన్సెంటివ్ ఇవ్వాలి. బస్ బాడీ బిల్డింగ్‌తో పాటు మిగిలిన వర్క్‌షాపులను బలోపేతం చేయాలి. ప్రొడక్షన్ యూనిట్లలో 2013 నుంచి రావాల్సిన మ్యాన్ అవర్ రేటు అమలు చేయాలి.
- అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న రిటైర్డ్ అధికారులు, సూపర్‌వైజర్లను తీసేసి వారి స్థానంలో ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలి.
- ఎంటీడబ్ల్యూ యాక్ట్ ప్రకారం 8 గంటల పనిదినాలు (సిటీ సర్వీసులలో 7 గంటలు) అమలు చేసి మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల్లోపు డ్యూటీలు పూర్తయ్యేలా డ్యూటీలు ఇవ్వాలి. ప్రతి కార్మికుడికి నెలకు 3 రోజులు సెలవులు మంజూరు చేయాలి. ఇలా 21 డిమాండ్లు యాజమాన్యం ముందు పెట్టినట్లు తెలిపారు.

కాంగ్రెస్ అంటేనే మోసం

- పథకాలు అమలుచేసే సత్తా ప్రభుత్వానికి లేదు
- సీఎం రేవంత్ రెడ్డివి తుపాకీ రాముడి మాటలు
- హామీలిచ్చి, మోసం చేయడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య
- 'కవ్వంపల్లి' ఇందిరమ్మ ఇండ్ల విషయంలో మభ్యపెడుతున్నడు
- 400 మందికి ఇండ్లు కట్టించి బిల్లులు ఇప్పిస్తే వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి నేను పోటీ చేయను
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సవాల్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మానకొండూర్, జనవరి 27: 'కాంగ్రెస్ అంటేనే మోసకారి పార్టీ. మాయమాటలు, అలవికాని హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చింది. సంక్షేమ పథకాలను అమలు చేసే సత్తా ఆ ప్రభుత్వానికి లేనే లేదు. వాళ్లు చెప్పేవన్నీ ఉత్త ముచ్చట్లే' అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శించారు. సోమవారం మానకొండూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డివి తుపాకీ రాముడి మాటలని, హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యఅని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏనాడూ నిజాలు మాట్లాడలేదని విమర్శించారు. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, 9న ప్రమాణ స్వీకారం చేసిన అదే రోజు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేస్తానని ఎన్నికల ముందు ప్రకటించారని గుర్తుచేశారు. గెలిచాక 100 రోజుల్లో అమలు చేస్తానని మళ్లీ మాట మార్చారని, 100 రోజుల తర్వాత ఇంటింటికీ సర్వే పేరుతో ప్రజలను మరోసారి మోసం చేశారని, ఇప్పటికీ ప్రభుత్వం ఏర్పడి 415 రోజులైనా హామీలు, గ్యారంటీలు అమలు చేయలేదని ఆరోపించారు. ఇప్పుడు ప్రజాపాలన గ్రామసభల పేరుతో నాలుగు పథకాల అమలు చేస్తామని మరోసారి ప్రజలను పిచ్చోళ్లను చేశారని మండిపడ్డారు. ప్రజల ఆశల మీద రాజకీయాలు చేయడం కాంగ్రెస్ నేతలు మానుకోవాలని హితవు పలికారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా పేరుతో ప్రజలను దరఖాస్తు చేసుకోమ్మని మభ్యపెట్టి మండలానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక్క మానకొండూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లకు దాదాపు 40 వేలు, రేషన్‌కార్డులకు 20 వేల మందిని అర్హులుగా అధికారులు, కాంగ్రెస్ నేతలు గుర్తించి పంచాయతీ కార్యాలయాల్లో జాబితా అతికించారని, మరి వారికి ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. మానకొండూర్ నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరైనట్లు గ్రామాల్లో ఎమ్మెల్యే ఫ్లెక్సీలు పెట్టి ప్రచారం చేసుకుంటున్నాడని, మరి ఇప్పుడు 40 వేల మందికి ఎలా ఇండ్లు కట్టిస్తారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే కమీషన్ల నారాయణ అని, నియోజకవర్గంలో కేవలం 400 మందికి ఇండ్లు కట్టించి బిల్లులు ఇప్పిస్తే వచ్చే ఎన్నికల్లో తాను మానకొండూర్ నుంచి పోటీ చేయనని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, గడ్డం నాగరాజు, గుర్రం కిరణ్‌గౌడ్, గంట మహిపాల్. రామంచ గోపాల్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, ఇస్కుల్ల అంజనేయులు, రాజశేఖర్, గడ్డం సంపత్, నెల్లి శంకర్ ఉన్నారు.

మెనూ చార్జీలు పెంచండి

- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

మార్కెట్ ధరలను అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కరీంనగర్ తెలంగాణచౌక్, జనవరి 27 : మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్యంగా పని చేస్తున్న కార్మికులు ఆయా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహించారు. కరీంనగర్‌లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లుగానే మధ్యాహ్న భోజన కార్మికులకు కూడా నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో కోడిగుడ్డు రూ.8 ఉంటే, మధ్యాహ్న భోజన పథకానికి మాత్రం రూ.5 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థికి మెనూ చార్జీలను రూ.25 చెల్లించాలని కోరారు. కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టి తీరా అధికారంలోకి రాగానే విస్మరించిందని మండిపడ్డారు. వంట సందర్భంలో కార్మికుల ప్రమాదాలకు బీమా సౌకర్యం, పెండింగ్‌లో ఉన్న సరుకుల డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక బుచ్చన్నయాదవ్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు సాయిలు, రజిత, దేవక్క, సరోజన, రేణుక, సాహెన, నాగవ్వ, పద్మ పాల్గొన్నారు.

గత 5 సం||లలో కరీంనగర్ నగరపాల